మహిళా వైద్యులకు భద్రత పెంచాలి



వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం దుర్మార్గపు చర్య. ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్టు వేయాలంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించే విషయమై శ్రద్ధ చూపాలి. రాత్రి వేళల్లో బీట్ కానిస్టేబుల్ వైద్యశాలలకు రక్షణగా ఉండాలి.

–డాక్టర్ రాయపూడి హనుమంతురావు, పెదకూరపాడు



ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి

వైద్యులపై దాడులు జరిగినప్పుడు స్పందించడం కంటే జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచే మహిళలతో గౌరవంతో మెలిగేలా మగ పిల్లలకు నేర్పించాలి. మత్తుకు బానిసలు కాకుండా చూడాలి. వైద్యశాలల్లో రాత్రి విధులు నిర్వహించే వైద్యులకు రక్షణగా కానిస్టేబుల్ ఉండాలి.

–డాక్టర్ జోన్నలగడ్డ చైతన్య, పెదకూరపాడు, సీహెచ్‌సీ



క్లుప్తంగా

రేపు శనీశ్వరునికి ప్రత్యేక పూజలు



మాచర్ల: పాత మాచర్లలోని గంగాపార్వతీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వేంపటి వంశీకృష్ణశర్మ గురువారం తెలిపారు. ఉదయం నుంచే శనీశ్వరునికి తైలాభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తామని చెప్పారు. ఈ పూజలు చేయించాలనుకునే వారు 9849687341ను సంప్రదించాలని వివరించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని ఇష్టకామేశ్వర వీరభద్ర స్వామి దేవాలయంలోని శనీశ్వర మూలవిరాట్‌కు శనివారం తెల్లవారుజాము 4గంటల నుంచి ప్రత్యేక పూజలు చేస్తామని అర్చకులు భరణి తెలిపారు. మధ్యాహ్నం వరకు నిర్వహించే ఈ పూజలలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

దాచేపల్లి కమిషనర్‌గా అప్పారావు బాధ్యతల స్వీకరణ



దాచేపల్లి: నగర పంచాయతీ కమిషనర్‌గా ఎంవీ అప్పారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అప్పారావును దాచేపల్లి కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రధానంగా పారిశుద్ధ్యంపై దృష్టిపెడతానని, ఇంటింటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటానని అప్పారావు చెప్పారు. ఆదాయం పెంపునకూ కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన నారాయణరావు బదిలీపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు వెళ్లారు. అప్పారావును చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెర బత్తిన అన్నపూర్ణ, నాయకులు కొప్పుల సాంబయ్య, షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్ శాలువాలతో సన్మానించారు.

పిడుగురాళ్ల కమిషనర్ శ్రీధర్ బాధ్యతల స్వీకారం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పర్వతనేని శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న అభయాంజనేయ స్వామిని శ్రీధర్ దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కమిషనర్ శ్రీధర్‌కు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం తన కార్యాలయంలో శ్రీధర్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మార్నింగ్ వాక్‌లో భాగంగా పట్టణంలోని శివారు ప్రాంతాల్లో పర్యటిస్తానని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని వివరించారు. పిడుగురాళ్ల పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు హద్దులు గుర్తింపు



రెంటచింతల: విద్యుత్ ఆధునీకీకరణ పనుల్లో భాగంగా స్థానిక మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు హద్దులను గుర్తిస్తున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, గ్రామ కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు గురువారం తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల వినతి మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. హద్దుల గుర్తింపు అనంతరం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ డి.కాంతారావు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే విద్యుత్ సంస్థ కాంట్రాక్టర్ ఇప్పటికే స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం గమనార్హం.

విద్యార్థులకు ఆటలపోటీలు

పిడుగురాళ్ల: పట్టణంలోని వివేకానంద స్కూల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రైవేటు స్కూల్ విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు, రెండో బహుమతి విజయభేరి స్కూల్, మూడో బహుమతి స్కాలర్స్ పాఠశాల విద్యార్థులు, నాలుగో బహుమతి వివేకానంద స్కూల్ విద్యార్థులు సాధించినట్లు ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు అందజేయటంతోపాటు షీల్డ్‌ను కూడా అందజేసినట్లు తెలిపారు. తొలుత ఎంపీడీఓ కాశయ్య హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వేతనాల్లేక ఆయాసం..!

- గత ఏప్రిల్ నుంచి అందని వైనం
- కుటుంబ పోషణకు ఇబ్బందులు
- ప్రతినెలా క్రమం తప్పకుండా ఇవ్వాలని వేడుకోలు

దాచేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయా (స్కావెంజర్లు) ఐదు నెలలుగా గౌరవ వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణకు సతమతమవుతున్నారు. గురజాల నియోజకవర్గ వ్యాప్తంగా 201 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 182 మంది ఆయాలు పనిచేస్తున్నారు. 300 మంది విద్యార్థులు ఉంటే ఒక ఆయా, 600 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు, 600 మందికి మించి ఉంటే నలుగురు చొప్పున ఆయాలను విద్యాశాఖాధికారులు నియమించారు. వీరికి ప్రతినెలా రూ.6,000 గౌరవ వేతనంగా అందిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పాఠశాలలను, మరుగుదొడ్లను శుభ్రం చేయటం, మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ఆవరణను శుభ్రం చేయటం వీరి విధులు. వీటితో పాటుగా పాఠశాల పరిసరాల్లో మొక్కల సంరక్షణ పనులూ చేస్తుంటారు. గత ప్రభుత్వం వీరికి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించేది.



ప్రభుత్వ పాఠశాలను శుభ్రం చేస్తున్న ఆయా

అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విషయంలో స్పష్టత కరువైంది. ఫలితంగా వేతనాలు ఆగిపోయాయి. స్కూల్ నిర్వహణ నిధుల నుంచి చెల్లిస్తారా? లేక ప్రత్యేక నిధులు కేటాయిస్తారా అనేది తేలాల్సి ఉంది. ఐదునెలలుగా వేతనాలు లేకపోవడంతో ఆయాలు విధులను బహిష్కరించే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే పాఠశాలల్లో పారిశుద్ధ్య అధ్వానంగా మారుతుంది.

గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయాలకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించింది. విద్యార్థులకు ఇచ్చే అమ్మఒడి నిధుల్లో నుంచి రూ.2 వేలు నగదును స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ కింద జమ చేసి ఆ ఫండ్ నుంచి ఆయాలకు వేతనాలు చెల్లించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆయాలకు క్రమ తప్పకుండా వేతనాలు అందాయి. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడం, తదనంతరం ప్రభుత్వం మారడంతో వేతనాలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్నిచోట్ల గతంలో ఉన్న ఆయాలను తొలగించి కొత్తవారిని నియమించారు. నెలనెలా వేతనాలు వస్తాయని సంబరపడి విధుల్లో చేరిన వారు కూడా వేతనాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వేతనాలు విడుదల చేయాలని ఆయాలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలకు గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉంది. వేతనాలు చెల్లింపుపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే వేతనాలు ఆయాల బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తాం.

–కాంతారావు, ఎంఈఓ, దాచేపల్లి

పాడి పశువుల పోషణలో జాగ్రత్తలు అవసరం

మిట్టగుడిపాడు(రెంటచింతల): పాడి పశువుల పోషణలో జాగ్రత్తలు పాటిస్తే మేలు జరుగుతుందని జిల్లా పశు గణాభివృద్ధి కార్యనిర్వహణ అధికారి డాక్టర్ బాల శంకర్ చెప్పారు. గురువారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సర్పంచ్ గొట్టం ప్రమీలతో కలిసి బాలశంకర్ ప్రారంభించి మాట్లాడారు. పాడి పశువుల పోషణలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి, పార్టీ నాయకులు గొట్టం గురువారెడ్డి, గురజాల పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ నాగమల్లేశ్వరరావు, పశువైద్యాధికారులు బషీర్, మల్లారెడ్డి, నాగార్జున దీపక్, పశువైద్య సహాయకులు టి.బాబు, వి.రమేష్ నాయక్, వి.భాస్కర్ నాయక్, కె.త్రివేణి, ఎ.కవిత తదితరులు పాల్గొన్నారు.



చికిత్సశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గొట్టం ప్రమీల, జిల్లా పశు గణాభివృద్ధి అధికారి డాక్టర్ బాల శంకర్

చైర్మన్ పోలూరి నరసింహారావుకు అభినందన

మాచర్ల: పట్టణంలోని కోదండ రామాలయంలో గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొత్తగా ఎంపికైన మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అభినందన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి(జేబీఆర్) హాజరయ్యారు. ఆక్రమణకు గురైన ఆర్యవైశ్య భూములను రక్షిస్తామని చెప్పారు. ఆర్యవైశ్యులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. కజ్జం సైదయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎరువుల అసోసియేషన్ నాయకులు, పలు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావును శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, పోలిశెట్టి శ్రీను, మాచర్ల చిన ఏసోబు, కౌన్సిలర్లు మదార్‌సాహెబ్, ఆర్య వైశ్య సంఘ నాయకులు మారం ప్రసాద్, కంభంపాటి అనిల్‌కుమార్, వెంకటరమణ (చంటి), సూరె యలమంద, రామకృష్ణ, భవనాశి వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కజ్జం గురవయ్య, సతీష్, మారం శ్రీను, గాలేశ్వరరావు, కొత్తా చిన్న శ్రీను, పోలా సత్యం, చిన వెంకట్రామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుదాం

మాచర్ల/కారెంపూడి/రెంటచింతల/మాచర్ల రూరల్/పిడుగురాళ్ల రూరల్: స్థానిక పత్తి ఫ్యాక్టరీలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటుదామని పేర్కొన్నారు. క్రీడలతో కలిగే ప్రయోజనాలను వెల్లడించారు. డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా అధ్యాపకురాలు జ్యోతితో పాటు, స్పోర్ట్స్‌మెన్ మహేష్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డిగ్రీలు పొందిన విద్యార్థులకు మాచర్ల ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి కుర్రి సాయి, వెంకటేశ్వరరెడ్డి ధ్రువీకరణపత్రాలు అందజేశారు.

- కారెంపూడి మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక మెయిన్ స్కూల్లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఎంఈఓ రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. గిడుగు గొప్పదనాన్ని కీర్తించారు. బాల సాహితీవేత్త బి.మాన్‌సింగ్ నాయక్ తెలుగు ఔన్నత్యాన్ని వివరించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రదర్శించిన నృత్య రూపకాలు అలరించాయి. ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు.
- రెంటచింతల ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ మాట్లాడుతూ భాష ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గురించి వివరించారు. ముందుగా పాఠశాల ఆవరణలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్.భాగ్యమేరి, ఫౌండేషన్ సభ్యులు గాదె లూర్థుమర్రెడ్డి, ఉపాధ్యాయులు పి.సత్యాజ్‌బేగం, జె.కృష్ణనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.
- మాచర్ల రూరల్ మండలం కొప్పునూరు జెడ్పీ హెచ్ఎస్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను హెచ్ఎం నాగమణి సన్మానించారు.
- పిడుగురాళ్ల రూరల్ మండలం బ్రాహ్మణపల్లిలోని గీతికా సీబీఎస్‌సీ విద్యా సంస్థలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ బాలగంగాధర్‌రెడ్డి భాష విశిష్టతను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బహుమతులను అందజేశారు. విద్యార్థులు కవుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డైరెక్టర్ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.



మాచర్లలో అధ్యాపకురాలు జ్యోతిని శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం



కారెంపూడి ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల నృత్యరూపకం



కారెంపూడి మెయిన్ స్కూల్లో మాట్లాడుతున్న బాల సాహితీవేత్త మాన్‌సింగ్ నాయక్



రెంటచింతలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళి



కొప్పునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



పిడుగురాళ్ల రూరల్ బ్రాహ్మణపల్లిలో కవుల వేషధారణలో విద్యార్థులు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అవగాహన కార్యక్రమంలో వైద్యులు

మాచర్ల: అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యులు అన్నం వెంకటేష్, మందలపు మౌనిక, మారేపల్లి భవ్యశ్రీ చెప్పారు. రోటరీ క్లబ్, కేసీపీ యాజమాన్యం సంయుక్తంగా బుధవారం కేసీపీ వెలగపూడి లక్ష్మణదత్తు ఆడిటోరియంలో బేసిక్ లైఫ్ సపోర్టు ఫస్ట్ ఎయిడ్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించాయి. కేసీపీ జనరల్ మేనేజర్ కె.వెంకటరమణ, రోటరీ డెప్యూటీ గవర్నర్ కె.రామకోటయ్య, అధ్యక్షురాలు కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వైద్యులు ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలకు తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. ఆహార అలవాట్లు, వ్యాయామంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రోగ్రాం కన్వీనర్‌గా మారేపల్లి లక్ష్మణనారాయణ వ్యవహరించగా, కేసీపీ హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు, రోటరీ సీనియర్ సభ్యులు పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రకాష్, చిన్ని సత్యనారాయణ ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ళు, డైరెక్టర్లు పాల్గొన్నారు. శుక్రవారం కూడా ఉదయం పది గంటలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందని ప్రోగ్రాం కన్వీనర్ లక్ష్మీనారాయణ చెప్పారు.



సదస్సులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

పిడుగురాళ్లరూరల్: పిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయి చెప్పారు. కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై కామేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం కృష్ణకుమారి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయి

ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు దాతలు గురువారం కుర్చీలు అందజేశారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తగరం ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో రూ.4,500 విలువ చేసే 8 కుర్చీలను ఉపాధ్యాయులకు అందించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఆనంద్‌కుమార్ చెప్పారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

మాచవరం: తెలంగాణ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. తెలంగాణ నుంచి మాచవరం మండలం గోవిందాపురం రేవు వద్దకు అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, 421 తెలంగాణ మద్యం సీసాలు ఉన్న బస్తాలను పట్టుకొని సీజ్ చేసినట్లు వివరించారు. తెలంగాణలోని చింతిర్యాల గ్రామానికి చెందిన ఇద్దరిని, ఆంధ్రా ప్రాంతానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న కారు, బైక్ సీజ్ చేసినట్లు వెల్లడించారు. మద్యం విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం సీసాల బస్తాలు

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో విద్యార్థులు

దాచేపల్లి : నడికుడి దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ బి.మల్లికార్జునశాస్త్రి గురువారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో అండర్ –14,16 విభాగాల్లో జరిగిన 60 మీటర్ల రన్నింగ్, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో తమ విద్యార్థులు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని వివరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను స్కూల్ ఉపాధ్యాయులు, సాగర్ సిమెంట్స్ ప్రతినిధులు అభినందించారు.

సేంద్రియ సేద్యంతో అధిక దిగుబడులు

మంచికల్లు(రెంటచింతల): సేంద్రియ సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని మంచికల్లులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన రైతులకు సేంద్రియ సేద్యం, విత్తనశుద్ధి వల్ల ప్రయోజనాలను వివరించారు. వరి నాటు సమయంలో కాలిబాటలు వేయడంపై అవగాహన కల్పించారు. పొలంగట్లపై కలుపు లేకుండా చేయడం వల్ల పాముపొడ తెగులు వ్యాప్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, గ్రామ పెద్దలు యరపతినేని మట్టయ్య, శిలంనేని శివ తదితరులు పాల్గొన్నారు.



పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

ఆదివాసీల సంఘీభావ సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

నకరికల్లు: దేశంలోని సహజ వనరులను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడలను వ్యతిరేకిస్తున్న ఆదివాసీలపై దాడులను ఖండిస్తూ సెప్టెంబర్ 1న నెల్లూరులో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. ఆదివాసీ పోరాటాలకు సంఘీభావంగా నిర్వహించనున్న సదస్సు కరపత్రాలను స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యభారతం, మణిపూర్, కాశ్మీర్ తదితర ప్రాంతాల్లోని సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ దారుణాలను అడ్డుకుంటున్న ఆదివాసీలపై ఒక్క మధ్య భారతంలోనే సుమారు 200 మంది ఆదివాసీలు, ఉద్యమకారులను హతమార్చారని చెప్పారు. నెల్లూరు పట్టణంలోని టౌన్ హాల్లో దక్షిణ కోస్తా ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. సదస్సుకు ఎందరో ప్రముఖులు హాజరై ప్రసంగిస్తారని అనంతరం భారీ ర్యాలీ కార్యక్రమం జరుగుతుందనన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకడావత్ కోటానాయక్, లాలూ, మల్లారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షేక్.మస్తాన్‌వలి, వి.కోటానాయక్

ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ

ఆవులవారిపాలెం(క్రోసూరు): గుంటూరు, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో నరసారావుపేట జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు మండలంలోని ఆవులవారిపాలెం గ్రామ సచివాలయంలో గురువారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్, గుంటూరు సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయనిక ఎరువుకలు మోతాదులో అలాగే జీవన ఎరువులు అజిటోబాక్టర్, మైకోరైజా వాడాలని తెలిపారు. రైతులకు ప్రత్తి, వరి, మిరప పంటల యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. క్రోసూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు వి.హనుమంతరావు మాట్లాడుతూ రైతులు పెట్టుబడి ఖర్చును వీలైనంత తగ్గించుకొని, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను అవలంబిస్తూ అధిక దిగుబడులు పొందాలన్నారు. ఏవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

వెల్దుర్తి: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళ మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఉడతల అంజమ్మ (36) కొన్నేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. వ్యాధి తీవ్రం కావటంతో బాధను తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న బంధువులు వైద్యశాలకు తరలించారు. ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈమెకు భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంజమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టీచ్ టూల్ ట్రైనింగ్ టీఏ చెల్లించాలి

మాచర్ల రూరల్: ఉపాధ్యాయులకు నిర్వహించిన విద్య - టీచ్ టూల్ ట్రైనింగ్ టీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.కృష్ణారావు, కార్యదర్శి వి.వి.రవికుమార్ గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాచర్ల మండలంలో 80 మందికిపైగా ఉపాధ్యాయులకు గత నెలలో తొమ్మిది రోజులపాటు టీచ్ టూల్ కార్యక్రమం మీద నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు టీఏ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ అల్లి సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్లు కృష్ణార్జినాయక్, కొర్లయ్య, నాసరయ్య పాల్గొన్నారు.



ఎంఈఓ అల్లి సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు